సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

ఆదివారం । 14 । జనవరి । 2024



ఆమె సంకల్పం.. ఆదర్శం
అన్ని రంగాల్లోనూ పురుషులకు దీటుగా మహిళలు సత్తా చాటుతున్నారు. జిల్లాలో పలువురు మహిళలు ఆటోడ్రైవర్లుగా రాణిస్తున్నారు. IIలో



కిలో టమాట రూ.16
అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట గరిష్టంగా రూ.16 కనిష్టంగా రూ.6, సరాసరిన రూ.12 ధర పలికాయి.

గరిష్టం/కనిష్టం
33.9°/14.2°

జిల్లా అంతటా శనివారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉదయం వేళ చలి తీవ్రత పెరిగింది. గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

పకడ్బందీగా ప్రధాని పర్యటన ఏర్పాట్లు



సమీక్షిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి అర్బన్/ గోరంట్ల: ప్రధాని నరేంద్ర మోదీ పాలసముద్రం పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. శనివారం గోరంట్ల మండలం పాలసముద్రంలో ప్రధాని ప్రారంభించే 'నాసిన్' సంస్థ భవన సముదాయం, హెలిప్యాడ్, పలు భవనాలతో పాటు పర్యటన ఏర్పాట్లను కలెక్టర్ పరిశీలించారు. అనంతరం పుట్టపర్తి కలెక్టరేట్‌లోని 'స్పందన' సమావేశంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రధాని పర్యటనలో భాగంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, గవర్నర్, కేంద్ర మంత్రులు పాల్గొనే అవకాశం ఉందన్నారు. పర్యటనకు సంబంధించి భద్రత, రవాణా, వసతి, వైద్య సేవలు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. రెవెన్యూ శాఖ సమన్వయంతో అవసరమైన చోట్ల స్వాగత తోరణాలు, హోర్డింగులు ఏర్పాటు చేయాలన్నారు. పుట్టపర్తి విమానాశ్రయం, నాసిన్ సంస్థ వద్ద హెలిప్యాడ్, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. కార్యక్రమంలో పాల్గొనే వారికి పాస్‌లు జారీ చేయాలని డీఆర్‌ఓ, ఆర్డీఓలను ఆదేశించారు. కార్యక్రమంలో డీఐజీ అమ్మిరెడ్డి, ఎస్పీ మాధవరెడ్డి, జేసీ అభిషేక్‌కుమార్, డీఆర్‌ఓ కొండయ్య, సబ్ కలెక్టర్ అపూర్వ భరత్, ఆర్డీఓలు భాగ్యరేఖ, వంశీకృష్ణ, రమేష్‌రెడ్డి, జిల్లా అధికారులు, 'నాసిన' ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణ, ఉద్యోగావకాశాలు

అనంతపురం: కీట్స్ ట్రస్టు ఆధ్వర్యంలో నందిగామ (విజయవాడ)లో హెల్త్ కేర్ కౌన్సెలర్/ కో-ఆర్డినేటర్ కోర్సుల్లో ఉచిత శిక్షణ, ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు అడ్మిషన్స్ కో-ఆర్డినేటర్ హరిప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏదేని డిగ్రీ పూర్తి చేసి 19 నుంచి 30 ఏళ్లలోపు వయస్సు కలిగిన వారు అర్హులని పేర్కొన్నారు. ఎంపికైన వారికి 60 రోజుల పాటు శిక్షణతో పాటు ఉచిత భోజన, వసతి కల్పించనున్నట్లు వివరించారు. హెల్త్‌కేర్, కంప్యూటర్ స్కిల్స్, స్పోకెన్ ఇంగ్లిష్, కమ్యూనికేషన్ స్కిల్స్, లైఫ్ స్కిల్స్, ఇంటర్వ్యూ స్కిల్స్, వర్క్‌ప్లేస్ ఎథిక్స్ నేర్పించనున్నట్లు పేర్కొన్నారు. శిక్షణానంతరం కార్పొరేట్ ఆస్పత్రులు, హెల్త్‌కేర్ వీపీఓ వంటి సంస్థల్లో నెలకు రూ.20 వేలకు తగ్గకుండా జీతం వచ్చే ఉద్యోగ అవకాశం కల్పించనున్నట్లు ప్రకటించారు. పూర్తి వివరాలకు 90004 87423 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.



బోగి మంటలు వేసిన మహిళలు



రేగుపండ్ల విక్రయం



ముగ్గుల కోసం రంగుల కొనుగోళ్లు

సరదాల సంక్రాంతి సందడి

పుట్టపర్తిటౌన్: మూడు రోజుల పండుగ సంక్రాంతి సందడి మొదలైంది. పల్లె, పట్టణం అన్న తేడా లేకుండా జిల్లా అంతటా ప్రతి ఇల్లూ బంధుమిత్రులతో కళకళలాడుతోంది. భూమి తల్లికి అలంకారం చేసే గొబ్బెమ్మలతోటి ముత్యాల ముగ్గులు, యజమాని బాగుంటే చాలనుకునే బసవన్నల హడావిడి అప్పుడే ప్రారంభమైంది. పాల పొంగులు, పాత బాధలు మరిచిపోయి కొత్త ఆనందాలను వెతుక్కోవాలనే సూచనను అంతర్లీనంగా సూచించే భోగి మంటల్లో పాత వస్తువులను పడేసే పర్వదినం రాకతో సంక్రాంతి లక్ష్మిని ఆహ్వానిస్తున్న ప్రతి లోగిలిలో ఆనందాలు వెల్లివిరుస్తున్నాయి. చిన్నారులను ఆశీర్వదిస్తూ భోగి పండ్లను పోసే పండుగ కోసం చిన్నారుల తల్లులు ఎదురుచూస్తున్న తరుణం రానే వచ్చింది. ఆదివారం నుంచి మూడురోజుల పాటు సాగే భోగి, మకర సంక్రాంతి, కనుమ పర్వదినాలతో మార్కెట్లు కళకళలాడుతున్నాయి.

శిల్పారామంలో సంబరాలు

పుట్టపర్తి మున్సిపాలిటీలోని ఎనుముపల్లి సమీపాన శిల్పారామంలో మూడు రోజుల పాటు సంక్రాంతి సంబరాలు నిర్వహించనున్నట్లు ఏఓ రమేష్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ముగ్గుల పోటీలు, సోమవారం భరతనాట్యం, కూచిపూడి నృత్యం, డ్యాన్స్ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

మైనార్టీలకు మొండిచెయ్యి!

ముస్లింలకు ప్రాధాన్యమివ్వని టీడీపీ

- 20 ఏళ్లలో ఒకేసారి అసెంబ్లీ టికెట్
- ఆ తర్వాత పక్కన పెట్టిన చంద్రబాబు
- ప్రతి ఎన్నికలోనూ ప్రాధాన్యం ఇస్తున్న వైఎస్సార్‌సీపీ
- నాడు వైఎస్సార్.. నేడు జగన్ మైనార్టీలకు పెద్దపీట



సాక్షి, పుట్టపర్తి: మాయ మాటలు చెప్పి దగ్గరకు తీసుకోవడం...అవసరం తీరగానే పక్కనపెట్టడం టీడీపీ అధినేత చంద్రబాబుకు మొదటి నుంచీ అలవాటు. ఎన్నికలు సమీపిస్తే చాలు రాజకీయాలకు కులం రంగు పులుముతారు. నాలుగేళ్లు పట్టించుకోని వర్గాలను దగ్గరకు తీసుకుంటారు. భుజం పై చెయ్యివేసి అలివిగాని హామీలిస్తారు. ఇలా ఇప్పుడు మైనార్టీలకు గాలం వేస్తున్నారు. కానీ జిల్లాలో అసెంబ్లీ, ఎంపీ సీట్లు ఇచ్చేందుకు మాత్రం కోలేదు. కానీ జిల్లాలోని ముస్లింల ఓటు రాబట్టుకునేందుకు మాత్రం గిమ్మిక్కులు చేస్తూ ఉంటుంది. జిల్లాలో కదిరి, హిందూపురం అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ముస్లిం ఓట్లు అధికంగా ఉన్నాయి. గత 2004, 2009, 2014, 2019 ఎన్నికలను పరిశీలిస్తే.. టీడీపీ కేవలం 2009లో మాత్రమే హిందూపురం నుంచి అబ్దుల్ ఘనికి అవకాశం కల్పించింది. ఆ తర్వాత ఆ పార్టీపెద్దలు ఆయనకు చెక్ పెట్టారు. సుమారు 20 ఏళ్ల కాలం లో ఒక్క టికెట్ మినహా టీడీపీలో ముస్లింలకు చంద్రబాబు న్యాయం చేసిన దాఖలాలు లేవు.

ముస్లింలంటే టీడీపీకి అలుసు. అందుకే చంద్రబాబు ఏనాడు వారికి అవకాశాలివ్వలేదు. కేవలం ఓటు బ్యాంకుగానే వాడుకుని వదిలేశారు. కానీ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్లు కల్పించి ఎంతో మేలు చేశారు. ఇక ఆయన తనయుడు, సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పార్టీలోనూ ప్రభుత్వంలోనూ అధిక ప్రాధాన్యం ఇచ్చారు. ఎమ్మెల్యేలుగా, ఎమ్మెల్సీలుగా గెలిపించి పాలనలో భాగస్వాములను చేశారు. తాజాగా కదిరి సమన్వయకర్తగా మక్బూల్‌కు అవకాశం ఇచ్చి మైనార్టీల అభివృద్ధి, సంక్షేమంపై తన చిత్తశుద్ధిని చాటుకున్నారు.

ఒక్కసారీ ఎంపీ సీటు ఇవ్వని వైనం..

హిందూపురం పార్లమెంట్ స్థానాన్ని టీడీపీ ఒక్కసారంటే ఒక్కసారి కూడా ముస్లింలకు కేటాయించలేదు. హిందూపురంలో ఒక్కసారి మినహాయిస్తే మిగతా ఏ నియోజకవర్గంలోనూ ముస్లిం పేరునూ ఎన్నికల వేళ కనీసం పరిగణనలోకి తీసుకోలేదు. ఏనాడూ ఇష్టపడరు. కానీ వైఎస్సార్ సీపీ ముస్లిం మైనార్టీలకు ఆదినుంచీ పెద్దపీట వేస్తూ వచ్చింది. ప్రతి ఎన్నికలోనూ జిల్లా నుంచి ముస్లింలకు అవకాశం కల్పించింది. ఎన్నికల్లో ఓటమి చెందినా భుజం తట్టి ఎమ్మెల్సీలను చేసింది.

నమ్మించి మోసం..

2014లో కదిరి నుంచి వైఎస్సార్ సీపీ తరఫున గెలిచిన అత్తార్ చాంద్‌బాషాకు టీడీపీ అధినేత చంద్రబాబు ప్రలోభాలకు గురి చేసి పార్టీలో చేర్చుకున్నారు. మంత్రి పదవి ఇస్తామని చెప్పి మోసం చేశారు. 2019లో ఎమ్మెల్యే టికెట్ కూడా ఇవ్వలేదు. పైగా అవకాశం వచ్చిన ప్రతి సారీ అవమానిస్తూ వచ్చారు. ఇప్పుడు కూడా కదిరి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జిగా కందికుంట వెంకట ప్రసాద్ కొనసాగుతూనే ఉన్నారు.

నాలుగు పర్యాయాల్లో ఒకసారే టికెట్..

హిందూపురం పార్లమెంటు పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి. రెండు దశాబ్దాలుగా టీడీపీ ముస్లింలను పూర్తిగా విస్మరించినట్లు స్పష్టమవుతోంది. కేవలం 2009లో హిందూపురం నుంచి అబ్దుల్ ఘనికి అవకాశం లభించింది. అంతకుముందు కానీ.. ఆ తర్వాత కానీ ముస్లింలకు జిల్లాలో ఒక్క చోట కూడా టికెట్ ఇవ్వలేదు. జిల్లాలో మడకశిర ఎస్సీ రిజర్వుడు స్థానం. మిగతా చోట్ల అక్కడక్కడా ముస్లిం ఓట్లు ఉన్నాయి. కదిరి, హిందూపురంలో అధికంగా ఉన్నాయి. ఓట్లు వేస్తే సీట్లు ఇస్తామని.. పదవులు కట్టబెడతామని చంద్రబాబు ఊకదంపుడు ఉపన్యాసాలు ఇస్తున్నారనీ.. క్షేత్రస్థాయిలో మాత్రం అమలు కాలేదని టీడీపీలోని ముస్లిం నేతలే వాపోతున్నారు.

నాడు వైఎస్సార్.. నేడు జగన్

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముస్లిం మైనార్టీల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇచ్చారు. పదవులు, రిజర్వేషన్లు మొదలు పథకాలు అమలులోనూ న్యాయం చేశారు. 2004లో హిందూపురం పార్లమెంటు అభ్యర్థిగా కర్నల్ నిజాముద్దీన్‌కు అవకాశం ఇచ్చారు. ఆ తర్వాత 2009లో లయన్ పి.ఖాసీం ఖాన్‌కు హిందూపురం ఎంపీ టికెట్ ఇచ్చారు. వైఎస్సార్ మరణానంతరం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తండ్రి బాటలోనే ముస్లింలకు మేలు చేస్తున్నారు. ప్రతి ఎన్నికలోనూ జిల్లాలో ఎక్కడో ఒకచోట స్థానం కల్పిస్తూనే వస్తున్నారు. 2014లో కదిరిలో అత్తార్ చాంద్ బాషాకు, 2019లో హిందూపురంలో ఇక్బాల్ అహ్మద్‌కు టికెట్ ఇచ్చారు. ప్రస్తుతం కదిరి ఇన్‌చార్జిగా మక్బూల్‌కు అవకాశం కల్పించారు. అందువల్లే ముస్లింలంతా 'హర్ దిల్ మే వైఎస్సార్... హమ్ సబ్ జగన్‌కే సాత్' అంటున్నారు.

ప్రతి ఎన్నికలోనూ వైఎస్సార్‌సీపీ పెద్దపీట

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మాత్రం ముస్లింలకు తగిన గుర్తింపు ఇస్తూనే ఉంది. ఆ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గత 2014లో కదిరి నుంచి అత్తార్ చాంద్‌బాషాకు అవకాశం కల్పించారు. నేతలను ఏకతాటిపైకి తెచ్చి గెలిపించారు. ఆ తర్వాత 2019లో హిందూపురం నుంచి ఇక్బాల్ అహ్మద్‌కు అవకాశం కల్పించారు. ఆయన ఓడిపోయినా.. ఎమ్మెల్సీ పదవి కట్టబెట్టి చట్టసభల్లో కూర్చునే భాగ్యం ఇచ్చారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లోనూ కదిరి నుంచి మక్బూల్‌కు అవకాశం సుగమమైంది. ఇటీవలే ఆయన్ను కదిరి సమన్వయకర్తగా వైఎస్సార్ సీపీ నియమించిన సంగతి తెలిసిందే.

సాయి మార్గమే .. ధర్మమార్గం

ప్రశాంతి నిలయం: సత్యసాయి మానవాళికి ధర్మమార్గాన్ని బోధించారని, ఆ మార్గంలో పయనిస్తే మానవ జీవితం సంపూర్ణమవుతుందన్న సందేశాన్నిస్తూ సత్యసాయి విద్యార్థులు ప్రదర్శించిన నాటిక ఆహూతులను ఆలోచింపజేసింది. సత్యసాయి క్రీడా సాంస్కృతిక సమ్మేళనంలో భాగంగా శనివారం రాత్రి ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంత్ సభా మందిరంలో సత్యసాయి మహాసమాధి చెంత ముద్దేనహళ్లి క్యాంపస్ విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. 'పరివర్తన్' పేరుతో సందేశాత్మక నాటికను ప్రదర్శించారు. ధర్మసూత్రాలను పాటించే కరణ్, అధర్మాన్ని పాటించే విక్రమ్ అనే ఇద్దరు యువకుల మధ్య జరిగే సంభాషణతో నాటిక ప్రారంభమవుతుంది. సత్యసాయి బోధించిన ధర్మసూత్రాలను, పురాణ ఇతిహాసాలను వివరిస్తూ విద్యార్థులు ప్రదర్శించిన నాటిక అందరినీ ఆకట్టుకుంది. అనంతరం విద్యార్థులు సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.



పరివర్తన్ నాటికలో...



పరివర్తన్ నాటికలోని ఒక ఘట్టం

సంక్షేమ పాలనకే పట్టం కట్టండి

- వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించండి
- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పిలుపు



మొరసలపల్లిలో మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



చిలమత్తూరు సభకు హాజరైన మహిళలు

చిలమత్తూరు: సంక్షేమ పాలన కోసం వైఎస్సార్‌సీపీకి పట్టం కట్టాలని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. శనివారం వైఎస్సార్‌సీపీ హిందూపురం పార్లమెంటు, అసెంబ్లీ సమన్వయ కర్తలు బోయ శాంతమ్మ, టి.ఎన్. దీపికతో కలిసి మంత్రి చిలమత్తూరు మండలం మొరసలపల్లి, చాగలేరు, పలగలపల్లి, సోమఘట్ట, చిలమత్తూరులో పర్యటించారు. ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన సభల్లో పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి మాట్లాడారు. పాదయాత్ర సమయంలో ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చి 99.5 శాతం నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. ప్రజల ఆరోగ్యానికి పెద్దపీట వేసి ఆరోగ్యశ్రీ కింద వైద్య సేవల వ్యయం రూ.25లక్షలకు పెంచారన్నారు. ప్రపంచస్థాయి పోటీని తట్టుకునే విధంగా పేద పిల్లలకూ ప్రభుత్వ పాఠశాలల్లో బైజూస్ కంటెంట్‌తో కూడిన డిజిటల్ విద్యనందిస్తున్నారని కొనియాడారు. జనం మధ్య ఉండే వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను సార్వత్రిక ఎన్నికల్లో గెలిపించాలని కోరారు.

బాబు, బాలయ్యకు జనం బాగోగులు పట్టవు

తెలుగుదేశం అధినేత చంద్రబాబు, ఆయన వియ్యంకుడు బాలయ్యకు నియోజకవర్గ ప్రజల బాగోగులు ఏమాత్రమూ పట్టవని మంత్రి పెద్దిరెడ్డి విమర్శించారు. గెలిచిన తర్వాత కనిపించకుండా సినిమా షూటింగుల్లో బిజీగా ఉండే బాలయ్య వల్ల నియోజకవర్గ ప్రజలకు ఏమాత్రమూ ఉపయోగం లేదన్నారు. ఈసారి మళ్లీ ఆ తప్పు చేయొద్దని విజ్ఞప్తి చేశారు. పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ మాట్లాడుతూ పారదర్శక పాలన, అర్హులకే సంక్షేమ పథకాలు అందించే జగనన్నను మళ్లీ సీఎం చేసుకుందామని ప్రజలకు పిలుపునిచ్చారు. హిందూపురం ఎంపీ, ఎమ్మెల్యే స్థానాలకు పోటీ చేసే వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకే పట్టం కట్టాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో ఏపీ ఆగ్రోస్ చైర్మన్ నవీన్ నిశ్చల్, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ పరిశీలకుడు రెడ్డీశ్వర్‌రెడ్డి, ఎంఆర్‌సీ రెడ్డి, కృష్ణమూర్తి, మాజీ ఎమ్మెల్యే అబ్దుల్ ఘని, జెడ్పీటీసీ సభ్యురాలు అనూష, ఎంపీపీ పురుషోత్తమరెడ్డి, పార్టీ మాజీ సమన్వయకర్త కొండూరు వేణుగోపాల్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఎల్ఎం మోహన్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి జనార్దన్‌రెడ్డి, మండల కన్వీనర్ రాజారెడ్డి, సర్పంచ్‌లు సంధ్య, బందేపల్లి శంకర్‌రెడ్డి, జయలలిత, వెంకటమ్మ, రత్నమ్మ, ఎంపీటీసీ సభ్యులు జగన్మోహన్‌రెడ్డి, సానె శిల్ప, సనమ్ హుస్నా, కవిత, నాగమణి, సీనియర్ నేత రామకృష్ణారెడ్డి, యువజన విభాగం నేత సురేష్‌కుమార్‌రెడ్డి, నాగరాజు యాదవ్, లక్ష్మీనారాయణ యాదవ్, రంగారెడ్డి, సుందర రాజు, అమర్నాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మహిళపై దాడి



గాయపడిన శ్రీదేవి

గాండ్లపెంట: మహిళపై దాడి చేసి గాయపరిచిన ఘటన మండలంలోని నీరుకుంట్లపల్లిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ వెంకటనారాయణ తెలిపిన మేరకు.. నీరుకుంట్లపల్లికి చెందిన ఎం.శ్రీదేవి, రామాంజనేయులు దంపతులు. వీరి ఇంటి ఎదురుగా జి.వెంకటనారాయణ కాపురం ఉంటున్నాడు. సమీపంలో ఉన్న వీధి లైటును శుక్రవారం తన ఇంటి వైపు తిప్పుకున్నాడు. ఈ క్రమంలోనే శ్రీదేవి భర్త రామాంజనేయులు ఎందుకు తిప్పుతున్నావంటూ ప్రశ్నించాడు. కోపోద్రిక్తుడైన వెంకటనారాయణ దుర్భాషలాడుతూ అతనిపై దాడికి యత్నించాడు. అడ్డుకున్న శ్రీదేవిపై దాడి చేశాడు. నోరు, ముక్కుకు గాయాలైన ఆమెను కుమారుడు రేవంత్‌కుమార్ వెంటనే కదిరి ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లాడు. శనివారం బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

లారీడ్రైవర్ బలవన్మరణం



సంతోష్ (ఫైల్)

పెనుకొండ రూరల్: ఆన్‌లైన్ గేమ్‌లకు బానిసై లారీ డ్రైవర్ బలవన్మరణం పొందిన సంఘటన పెనుకొండ మండలంలో చోటు చేసుకొంది. ఎస్‌ఐ రాజేష్ తెలిపిన మేరకు.. కర్ణాటక రాష్ట్రం మంగళూరుకు చెందిన సంతోష్ (45) లారీ డ్రైవర్. తాడిపత్రి నుంచి సిమెంట్ బస్తాలు రవాణా చేసేవాడు. శనివారం లోడు నింపుకుని మంగళూరుకు బయలుదేరాడు. మార్గమధ్యలో సుంకలమ్మ దేవాలయం సమీపంలో రహదారి పక్కనే చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహం వద్ద దొరికిన వస్తువుల ఆధారంగా పోలీసులు శనివారం కుటుంబసభ్యులకు సమాచారమిచ్చారు. తన భర్త ఆన్‌లైన్ గేములకు బానిసయ్యాడని, కుటుంబాన్ని కూడా సరిగా పట్టించుకునేవాడు కాదని భార్య అరుణ్ జ్యోతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మృతుడికి కుమార్తెలు శ్రావణి, దివ్యశ్రీ ఉన్నారు.

ఆమె సంకల్పం.. ఆదర్శం

- ఆటోడ్రైవర్లుగా రాణిస్తున్న మహిళలు
- నూతన 'ఉపాధి మార్గం'లో సత్తా
- కుటుంబానికి చేదోడు

సాక్షి, అనంతపురం డెస్క్: నేడు మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. అంతరిక్షం నుంచి ఐటీ వరకూ సత్తా చాటుతున్నారు. ఒకప్పుడు పురుషులకు మాత్రమే అనుకున్న రంగాల్లోనూ నేడు మహిళలు ప్రవేశిస్తున్నారు. ఎవరికీ ఎందులోనూ తీసిపోమని నిరూపిస్తున్నారు. వాహన రంగంలో ఒకప్పుడు మహిళలు పెద్దగా కన్పించేవారు కాదు. డ్రైవర్లుగా పనిచేయడం కష్టంతో కూడుకున్నదని భావించేవారు. అయితే.. ప్రస్తుతం వారి దృక్పథంలో మార్పు వచ్చింది. వాహన రంగంలోకీ పెద్ద సంఖ్యలో ప్రవేశిస్తున్నారు. విమాన పైలట్లుగా, రైల్వే లోకో పైలట్లుగా, బస్సు, ట్యాక్సీ, ఆటో డ్రైవర్లుగా సత్తా చాటుతున్నారు. మెట్రోపాలిటన్ నగరాల్లో అయితే మహిళా డ్రైవర్ల సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతోంది.

ఆటోడ్రైవర్లుగా అతివలు..

ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఒకప్పుడు మహిళా ఆటోడ్రైవర్లు ఎక్కడా కన్పించేవారు కాదు. మహిళలు ఆటో నడపడం వింతగా భావించేవారు. కానీ నేడు ఉమ్మడి జిల్లాలో సుమారు 50 మంది మహిళలు ఆటోడ్రైవర్లుగా జీవనం సాగిస్తున్నారు. అత్యధికంగా అనంతపురం నగరంలో 30 మంది దాకా ఉన్నారు. హిందూపురం, ధర్మవరం, తాడిపత్రి తదితర ప్రాంతాల్లోనూ జీవనోపాధి కోసం మహిళలు ఆటోలను ఏర్పాటు చేసుకున్నారు. కొందరు ప్రయాణికులను చేరవేస్తుండగా.. మరికొందరు వస్తు రవాణా కోసం ఆటోలను నడుపుతున్నారు.

ప్రభుత్వ తోడ్పాటు..

జీవనోపాధి కోసం ఆటోలను ఏర్పాటు చేసుకుంటున్న మహిళలకు ప్రభుత్వం తోడ్పాటు అందిస్తోంది. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) ద్వారా 'ఉన్నతి- మహిళా శక్తి' పథకం కింద డ్వాక్రా సంఘాల్లోని నిరుపేద ఎస్సీ, ఎస్టీ మహిళలకు ఆటోల కొనుగోలు కోసం వడ్డీలేని రుణాలు అందిస్తోంది. ఈ పథకం కింద 2023-24 ఆర్థిక సంవత్సరంలో అనంతపురం జిల్లాలో 13 మంది, శ్రీసత్యసాయి జిల్లాలో ఆరుగురు మహిళలు ఆటోలు సమకూర్చుకున్నారు. అలాగే ఆటో నిర్వహణ ఖర్చుల నిమిత్తం ఏటా రూ.పది వేల ఆర్థికసాయాన్ని వైఎస్సార్ వాహనమిత్ర పథకం కింద ప్రభుత్వం అందజేస్తోంది. ఆటో/వాహన డ్రైవింగ్‌పై ఆసక్తి ఉండి..జీవనోపాధి మార్గంగా ఎంచుకోవాలనుకునే మహిళలకు రూడ్‌సెట్, ఏఎఫ్ ఎకాలజీ వంటి సంస్థలు శిక్షణ ఇస్తున్నాయి. ఈ నేపథ్యంలో పలువురు మహిళలు ఆటోలు ఏర్పాటు చేసుకునేందుకు ముందుకు వస్తున్నారు.



ఈమె పేరు వరలక్ష్మి. బుక్కరాయసముద్రం మండలం చెన్నంపల్లి. ఒకప్పుడు దినసరి కూలీగా వెళ్లేది. అలాగే గ్రామంలోని మహిళా సంఘాల రికార్డులు రాస్తూ జీవనం సాగించేది. ఇప్పుడు నార్పల - అనంతపురం మార్గంలో ఆటో నడుపుతోంది. అన్ని ఖర్చులు పోనూ రోజుకు రూ.వెయ్యి దాకా ఆదాయం లభిస్తోంది. ఆటో వల్ల ఆమెతో పాటు భర్తకూ ఉపాధి లభిస్తోంది.



ఈమె పేరు శాంతి. అనంతపురం రూరల్ మండలం కందుకూరు గ్రామం. ఈమె కుటుంబానికి గ్రామంలోనే చిన్న కిరాణా కొట్టు ఉంది. అనంతపురం వెళ్లి కిరాణా సరుకులు కొనుగోలు చేస్తుంటారు. ఇంతకుముందు బాడుగ ఆటోల్లో తెచ్చుకునేవారు. ఇప్పుడు సొంత ఆటో సమకూర్చుకున్నారు. శాంతి స్వయంగా ఆటో నడుపుకుంటూ వెళ్లి సరుకులు తేవడమే కాదు..వాటిని చుట్టుపక్కల గ్రామాలకు తీసుకెళ్లి విక్రయిస్తోంది. తద్వారా ఆదాయం కూడా పెరిగిందని ఆమె చెబుతోంది.

పట్టుదలతో ఆటో నేర్చుకున్నా..



ఇంతకుముందు కూలి పనులకు వెళ్లేదాన్ని. ఉన్నతి పథకం కింద ఆటో కొనుగోలు చేశా. పట్టుదలతో డ్రైవింగ్ నేర్చుకున్నా. మా ఊరి నుంచి అనంతపురానికి నడుపుతున్నా. ప్రయాణికుల ఆదరణ బాగుంది. మహిళలన్న చిన్న చూపు లేదు. రోజూ రూ.700 నుంచి రూ.900 వరకు ఆదాయం వస్తోంది. కుటుంబ పోషణ, పిల్లల చదువులు సాఫీగా సాగిపోతున్నాయి. – సొలమ్మ, వెంకటంపల్లి, బుక్కరాయసముద్రం మండలం

స్కూల్ పిల్లలను చేరవేస్తున్నా..



ఓ ప్రైవేటు స్కూల్లో ఆయాగా పనిచేస్తున్నా. అలాగే ఆటో కూడా కొన్నా. స్కూల్ పిల్లలను ఇంటి నుంచి బడికి, అక్కడి నుంచి ఇంటికి చేరవేస్తుంటా. ఖర్చులు పోను రోజుకు రూ.800 దాకా మిగులుతోంది. ఆటో కొనుగోలుకు ప్రభుత్వం వడ్డీ లేని రుణం అందించింది. – పవన కుమారి, చిన్మయ నగర్, రాప్తాడు మండలం

అదృశ్యమైన వ్యక్తి దారుణ హత్య

అమడగూరు: అదృశ్యమైన ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. ఎస్‌ఐ బలరామయ్య తెలిపిన మేరకు.. మండలంలోని దాదెంవారిపల్లి తండాకు చెందిన వెంకటరమణ నాయక్ (40) ఈ నెల 7 నుంచి కనపడటం లేదు. దీనిపై ఆయన కుమారుడు లక్ష్మీనరసింహా నాయక్ రెండు రోజుల క్రితం అమడగూరు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పూలకుంటపల్లికి చెందిన ప్రభాకర్, లోకోజుపల్లికి చెందిన ఆర్‌ఎంపీ డాక్టర్ బాబుపై అనుమానం వ్యక్తం చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు శుక్రవారం అనుమానితులకు ఫోన్ చేసి స్టేషన్‌కు రమ్మన్నారు. ఈ క్రమంలోనే ప్రభాకర్ ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో మరింత అనుమానం కలిగిన పోలీసులు ఆర్‌ఎంపీ డాక్టర్ బాబును శనివారం స్టేషన్‌కు పిలిపించారు. తమదైన శైలిలో విచారణ చేయగా.. ఈ నెల 7న వెంకటరమణ నాయక్‌ను కర్ణాటక ప్రాంతం మల్లేపల్లి అటవీ ప్రాంతంలోకి తీసుకెళ్లి పెట్రోల్ పోసి నిప్పంటించి చంపేసినట్లు ఒప్పుకున్నాడు. వెంటనే బాబును తీసుకుని, కర్ణాటక పోలీసులతో పాటు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించగా, మృతదేహం కనిపించింది. తన తండ్రి వెంకటరమణ నాయకేనని కుమారుడు తేల్చాడు. హత్యకు గల కారణాలపై విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రముఖుల పేరుతో సైబర్ మోసాలు

- ఆట కట్టించిన పోలీసులు



నిందితుడిని అరెస్టు చూపుతున్న పోలీసులు

అనంతపురం క్రైం: ప్రముఖుల పేరుతో సైబర్ మోసాలకు తెగబడుతున్న ఓ మాయగాడి ఆట కట్టించారు అనంతపురం వన్‌టౌన్ పోలీసులు. సీఐ రెడ్డప్ప తెలిపిన మేరకు.. రాజస్తాన్ రాష్ట్రానికి చెందిన రిజ్వాన్, తమిళనాడు రాష్ట్రం కోయంబత్తూరుకు చెందిన విజయలక్ష్మితో కలిసి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని ప్రముఖ అధికారుల ఫొటోలను సేకరించేవాడు. వాట్సాప్ ప్రొఫైల్స్‌గా పెట్టుకుని కొందరి అధికారులకు ఫోన్లు చేసేవాడు. మాయమాటలతో చాటింగ్ చేస్తూ డబ్బులు లాగేవాడు. దీనిపై పలువురి ఫిర్యాదు మేరకు అనంతపురం వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. ఇప్పటికే విజయలక్ష్మిని అరెస్టు చేశారు. ఈ క్రమంలోనే ఏఎస్‌ఐ రజాక్, హెడ్‌కానిస్టేబుల్ భాస్కర్ నాయుడు, కానిస్టేబుల్ మహ్మద్‌లు బృందంగా రాజస్తాన్ వెళ్లి నిందితుడిని పట్టుకున్నారు. శనివారం అనంతపురం తీసుకొచ్చారు. మహిళల ఫొటోలను వాట్సాప్‌లో డీపీగా పెట్టుకుని చాటింగ్ చేయడం, అశ్లీల వీడియోలు పంపడం, అవతలి వ్యక్తుల ఫొటోలు, వీడియోలు సేకరించి సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేస్తానంటూ రిజ్వాన్ మోసాలకు పాల్పడేవాడని సీఐ వెల్లడించారు. సైబర్ నేరాలకు పాల్పడే వారు ఏ మూల దాక్కున్నా వదిలే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.

కర్ణాటక మద్యం పట్టివేత

- ముగ్గురి అరెస్ట్
- రూ. 2 లక్షల నగదు, 3 కత్తులు స్వాధీనం



నిందితులను అరెస్టు చూపుతున్న పోలీసులు

కదిరి టౌన్: అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. పట్టణ సీఐ నారాయణరెడ్డి తెలిపిన మేరకు.. ముందస్తు సమాచారం మేరకు పట్టణంలోని మదనపల్లి రోడ్డులో ఉన్న భారత్ పెట్రోల్ బంకు వద్ద శనివారం ఎస్‌ఐ బాబ్జాన్ సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ నిర్వహించారు. బైకులో తరలిస్తున్న 3 బాక్సుల కర్ణాటక మద్యం పట్టుకున్నారు. పట్టణానికి చెందిన షేక్ ఖాజావలీ, షేక్ వలీ బాషా, పఠాన్ ముజాహిద్దీన్‌ను అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ. 2,01,000 నగదు, 3 కత్తులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులు ఓ హత్య కేసులో ముద్దాయిలని తెలిసింది. కొన్ని రోజులుగా కర్ణాటక మద్యం తరలిస్తున్నారని పోలీసులు నిర్ధారించారు. నిందితులను కోర్టులో హాజరుపరిచి రిమాండ్ నిమిత్తం కదిరి సబ్ జైలుకు తరలించినట్లు సీఐ తెలిపారు.

ప్రియుడితో కలిసి భర్తను కడతేర్చిన భార్య



వెంకటరమణ నాయక్ (ఫైల్)



నితీశ్‌కుమార్



నందినిబాయి

బనశంకరి (బెంగళూరు): ప్రియుడితో కలిసి భర్తను ఓ భార్య హతమార్చింది. గుండె పోటుతో చనిపోయాడని నమ్మించే ప్రయత్నం చేసింది. తమదైన శైలిలో విచారించిన పోలీసులు.. భార్య, ఆమె ప్రియుడిని అరెస్ట్ చేశారు. బెంగళూరు ఆగ్నేయ విభాగ డీసీపీ బాబా శనివారం వివరాలు వెల్లడించారు. పుట్టపర్తి మండలానికి చెందిన నందిని బాయి, భర్త వెంకటరమణ నాయక్ (30) హెచ్‌ఎస్‌ఆర్ లేఔట్‌లో నివాసం ఉండేవారు. వెంకటరమణ పగటివేళ ఒక షాపులో, రాత్రి వేళ ఓ ఇంటి వద్ద సెక్యూరిటీ గార్డుగా పనులు చేసేవాడు. భార్య నందినిబాయి తమ ఊరికే చెందిన నితీశ్ కుమార్‌ను తరచూ ఇంటికి పిలిపించుకునేది. నితీశ్ ఏ పనీ చేయకుండా జులాయిగా తిరిగేవాడు. ఈ నెల 6న వెంకటరమణ విధులకు వెళ్లగా, నందినిబాయి ప్రియుడిని ఇంటికి పిలిపించింది. అయితే ఆ రోజు పనిలేదని కొంతసేపటికే భర్త తిరిగి వచ్చాడు. భార్య, ప్రియుడు పడకగదిలో ఉండడం చూసి కోపంతో గొడవకు దిగాడు. ఈ క్రమంలోనే నితీశ్‌కుమార్‌తో కలిసి నందినిబాయి వెంకటరమణ తలపై రుబ్బు గుండుతో దాడిచేసి అంత మొందించింది. అనంతరం మృతదేహాన్ని బాత్‌రూంలో పడేసింది. పోలీసులకు ఫోన్‌చేసి తన భర్త గుండెపోటుతో మరణించాడని చెప్పింది. వారు చేరుకుని మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పోస్టుమార్టం చేసి గుండెపోటు కాదని హత్య అనే అనుమానం ఉందని తెలిపారు. పోలీసులు నందినిబాయిని అదుపులోకి తీసుకుని విచారణ చేయగా విషయం అంతా వివరించింది. పోలీసులు ఇద్దరినీ అరెస్టు చేసి విచారణ చేపట్టారు.

సైబర్ మోసం.. యువకుడి ఆత్మహత్యాయత్నం

- సకాలంలో గుర్తించి రక్షించిన తల్లి

అనంతపురం క్రైం: సైబర్ నేరగాళ్ల వలలో పడిన ఓ యువకుడు ఆత్మహత్యాయత్నం చేసిన ఘటన స్థానిక పాతూరులో చోటుచేసుకుంది. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన సంఘటన వివరాలిలా ఉన్నాయి. పాతూరుకు చెందిన యువకుడు డిగ్రీ పూర్తి చేశాడు. కొన్ని రోజుల క్రితం తన సెల్‌కు ఓ వాట్సాప్ మెసేజ్ వచ్చింది. రూ. 1.000 తమ ఖాతాలో వేస్తే రూ. 1,600 ఇస్తామని దాని సారాంశం. దీంతో ఆశ పడిన యువకుడు డబ్బు వేయడం ప్రారంభించాడు. కొంత తిరిగి ఇస్తుండడంతో మరింత ఎక్కువ పంపసాగాడు. ఇంట్లోని బంగారం సైతం తాకట్టు పెట్టి రూ. 8 లక్షల మేర బదిలీ చేశాడు. భారీ మొత్తంలో డబ్బు వేయించుకున్న సైబరాసురులు చేతులెత్తేశారు. అటు వైపు నుంచి ఎలాంటి సమాధానం రాకపోవడంతో చేసేది లేక తనువు చాలించాలనుకున్నాడు. 5 రోజుల క్రితం ఉరేసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. సకాలంలో గుర్తించిన తల్లి బిడ్డను ఓదార్చింది. వెంటనే కుమారుడితో కలిసి పోలీసులను ఆశ్రయించింది. వివరాలు సేకరించిన వారు దర్యాప్తు ముమ్మరం చేశారు. మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన వ్యక్తుల ఖాతాల్లోకి డబ్బు బదిలీ అయినట్లు గుర్తించారు. వాటిని ప్రస్తుతానికి ఫ్రీజ్ చేయించారు. ఆ ఖాతాల్లో రూ.5 లక్షల దాకా నగదు ఉన్నట్లు తెలుస్తోంది. పంజాబ్ పేరుతో నడిచే ఓ బ్యాంకు ఖాతా ద్వారా లావాదేవీలు నడిపినట్లు తెలుస్తోంది.

విద్యావంతులే మోసపోతున్నారు..

ఏదైనా సమస్య ఉంటే నేరుగా 9440796800 నంబరుకు ఫోన్ చేయండంటూ అనంతపురం జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ నిత్యం ప్రచార మాధ్యమాల ద్వారా అవగాహన పెంచుతున్నారు. నిరక్షరాసులు పోలీసుల సూచనలు విని జాగ్రత్త పడుతుంటే విద్యావంతులు మాత్రం నేరగాళ్ల వలలో పడి విలవిలలాడుతుండడం గమనార్హం.

గొలుసు దొంగల ముఠా అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వాసుదేవన్

పుట్టపర్తి రూరల్: గొలుసు దొంగల ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. పుట్టపర్తి అర్బన్ పోలీస్ స్టేషన్‌లో శనివారం డీఎస్పీ వాసుదేవన్ విలేకరులకు వివరాలు వెల్లడించారు. నల్లమాడ మండలం చౌటకుంటపల్లికి చెందిన రామకృష్ణ కుమారుడు మల్లెల వినోద్‌కుమార్ (24), బడవాండ్లపల్లి జయచంద్ర కుమారుడు కుంచపు చంద్రమోహన్ (26), కుటాళ్లపల్లికి చెందిన గోపాల్ నాయక్ కుమారుడు మూడేకులం రవీంద్రనాయక్ (35), ఇదే గ్రామానికి చెందిన విరూపాక్ష రెడ్డి కుమారుడు కిరణ్ కుమార్ రెడ్డి (29) ముఠాగా ఏర్పడ్డారు. కొన్ని రోజులుగా పుట్టపర్తి పరిసర ప్రాంతాల్లోని మహిళల మెడల్లో చైన్లు దొంగిలించేవారు. ప్రజలను భయభ్రాంతులకు గురి చేసేవారు. విషయాన్ని ఎస్పీ మాధవరెడ్డి తీవ్రంగా పరిగణించారు. కేసు ఛేదనకు ప్రత్యేక బృందం ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాల ఆధారంగా ముమ్మర గాలింపు చేపట్టిన పోలీసులు శనివారం వారి గ్రామాల్లోనే నిందితులను అరెస్టు చేశారు. 4 సెల్‌ఫోన్లు, ఓ పల్సర్ బైక్ స్వాధీనం చేసుకున్నారు. రూ. 2.20 లక్షల విలువ చేసే సుమారు 44 గ్రాముల బంగారాన్ని రికవరీ చేశారు. దొంగిలించిన బంగారాన్ని పుట్టపర్తి, కదిరి పట్టణాల్లోని కొసమట్టం ఫైనాన్స్, కీర్తి ఫైనాన్స్ కంపెనీల్లో కుదువ ఉంచుతున్నట్లు నిందితులు అంగీకరించారని డీఎస్పీ తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అనుమానితులు కనిపిస్తే వెంటనే సమాచారం అందించాలని కోరారు. ముఠాను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన పుట్టపర్తి అర్బన్ సీఐ కొండారెడ్డి, ఎస్సైలు వీరేష్, వెంకటరాముడు, సిబ్బందిని అభినందించారు.

భూమి పూజకు మంత్రికి ఆహ్వానం



మంత్రి పెద్దిరెడ్డిని ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి

చిలమత్తూరు: హంద్రీనీవా ద్వారా పుట్టపర్తి నియోజకవర్గంలోని 193 చెరువులకు నీళ్లు నింపే బృహత్తర కార్యక్రమం ఈ నెల 19న ప్రారంభించనున్నారు. కార్యక్రమానికి శనివారం ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి రాయలసీమ రీజనల్ కోఆర్డినేటర్, భూగర్భ గనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని ఆహ్వానించారు. చిలమత్తూరు పర్యటనలో ఉన్న మంత్రిని కలిసి భూమి పూజకు ఆహ్వానం పలికారు. కార్యక్రమంలో జిల్లా అగ్రీ బోర్డు చైర్మన్ అవుటాల రమణారెడ్డి, నేతలు శివశంకర్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, రంగారెడ్డి పలువురు నేతలు పాల్గొన్నారు.